క్లుప్తంగా

వాటర్ బాటిళ్ల పంపిణీ



బాటిళ్లను పంపిణీ చేస్తున్న నాయకులు

షాద్‌నగర్: మండల పరిధిలోని మహల్ ఎలికట్ట గ్రామంలో గురువారం కాంగ్రెస్ పార్టీ నాయకులు గ్రామస్తులకు వాటర్ బాటిళ్లు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సూచన మేరకు నాయకుడు గున్న శర్వలింగంయాదవ్ ఇంటింటికీ వాటర్ క్యాన్‌లను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి తేజస్విని, నాయకులు బద్దుల మల్లయ్యయాదవ్, చంద్రయ్య, శ్రీశైలం, దినేశ్‌రెడ్డి, శివ, ఎండీ ఆజం, యూసుఫ్, రాములు తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు విరాళం



చెక్కు అందజేస్తున్న యువకులు

షాద్‌నగర్: శ్రీరామనవమిని పురస్కరించుకొని ఫరూఖ్‌నగర్‌లోని వేంకటేశ్వరస్వామి దేవాలయంలో నిర్వహించే బ్రహ్మోత్సవాలకు స్థానిక యువకులు గురువారం రూ.1.51లక్షల విరాళం ప్రకటించారు. ఈ మేరకు పట్టణానికి చెందిన గిరిమోని భరత్, కుందన్, కొట్టె ప్రవీణ్, ఇస్నాతి జలెందర్, శ్రీశైలంగౌడ్ విరాళానికి సంబంధించిన చెక్కును మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింలుకు అందజేశారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు ఒగ్గు కిషోర్, భూపాల్, సాయి ఈశ్వర్‌రెడ్డి, మహేశ్, రఘుపతి తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు విశాల

కేశంపేట: వేసవి కాలంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు దాతలు చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు తాండ్ర విశాలశ్రావణ్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని కొండారెడ్డిపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ పల్లె పద్మమ్మ, వెంకటయ్య జ్ఞాపకార్థం వారి కుమారుడు పల్లె ఆనంద్‌కుమార్ మండల కేంద్రంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గురువారం నిర్వహించిన కార్యక్రమంలో విశాల పాల్గొని చలివేంద్రం ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ అజాంఅలీ, ఇన్‌చార్జి ఎంపీడీఓ రవిచంద్రకుమార్‌రెడ్డి, ఎంపీఓ కిష్టయ్య, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గూడ వీరేశ్, సురేశ్‌రెడ్డి పాల్గొన్నారు.

సృజనాత్మకతను వెలికితీయాలి



విద్యార్థులతో డైరెక్టర్ శశికళశర్మ

నందిగామ: విద్యార్థులు తమలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయాలని హిప్పో క్యాంపస్ విద్యాసంస్థల డైరెక్టర్ శశికళశర్మ అన్నారు. మండల పరిధిలోని రంగాపూర్ హిప్పో క్యాంపస్‌లోని విద్యార్థులు రచించిన పలు పుస్తకాలను ఆమె గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు చక్కని సృజనాత్మకతతో లోతైన అధ్యాయనం చేసి, ఆంగ్ల భాషపై చక్కని నైపుణ్యాన్ని ప్రదర్శించి తమ జీవితంలో జరుగుతున్న సంఘటనల ఆధారంగా పలు పుస్తకాలు రచించడం అభినందనీయమన్నారు. విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జయశ్రీ, వైస్ ప్రిన్సిపాల్ కిరణ్మయి, ఉపాధ్యాయులు శ్రావణ్‌కుమార్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో విశ్రాంత హెచ్‌ఎం మృతి

షాద్‌నగర్: అనారోగ్యానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ షాద్‌నగర్ పట్టణానికి చెందిన ఓ విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు మృతి చెందాడు. పట్టణంలోని రైతు కాలనీకి చెందిన గోవర్ధన్‌గుప్తా(70) గత కొంతకాలంగా అనారోగ్యానికి గురై హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన నియోజకవర్గంలోని కిషన్‌నగర్, కేశంపేట, వేములనర్వ, కొత్తూరు ప్రభుత్వ పాఠశాలలో హెచ్‌ఎంగా పని చేశాడు. హెచ్‌ఎం మృతి పట్ల పలువురు సంతాపం వ్యక్తం చేశారు.

పేదల సంక్షేమమే ధ్యేయం

- ఎమ్మెల్యే కాలె యాదయ్య
- పలు గ్రామాల్లో సన్నబియ్యం పంపిణీ ప్రారంభం



షాబాద్: లబ్ధిదారులకు సన్నబియ్యం పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి



చేవెళ్ల: ఊరేళ్లలో సన్నబియ్యం పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య, నాయకులు



కేశంపేట: లబ్ధిదారులకు సన్నబియ్యం అందిస్తున్న నాయకులు

చేవెళ్ల: రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదల సంక్షేమమే ధ్యేయంగా పాలన కొనసాగిస్తోందని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని ఊరేళ్ల వార్డులోని రేషన్ దుకాణంలో గురువారం ప్రభుత్వం అందిస్తున్న సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదల కోసం ప్రభుత్వం ఈ కొత్త పథకానికి శ్రీకారం చుట్టిందన్నారు. పేద ప్రజలకు సన్నబియ్యం అందిస్తుండటంతో వారిలో సంతోషం వెల్లివిరుస్తోందన్నారు. కార్యక్రమంలో గ్రామ, మండల నాయకులు వెంకట్‌రెడ్డి, కృష్ణారెడ్డి, ప్రతాప్‌రెడ్డి, కుంచం శివకుమార్, కర్నె శివప్రసాద్, జనార్దన్‌రెడ్డి, యాదగిరి, పెంటయ్యగౌడ్, ఆగిరెడ్డి, రాములు, కార్తీక్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, జనార్దన్ తదితరులు ఉన్నారు.

సురంగల్‌లో..

మొయినాబాద్: మున్సిపాలిటీ పరిధిలోని సురంగల్‌లో గురువారం ఎమ్మెల్యే కాలె యాదయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామంలోని లబ్ధిదారులకు సన్నబియ్యం అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ గౌతమ్‌కుమార్, టీపీసీసీ సభ్యుడు షాబాద్ దర్శన్, మాజీ సర్పంచ్ రామకృష్ణగౌడ్, నాయకులు గడ్డం వెంకట్‌రెడ్డి, ఈగ రవీందర్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, హన్మంత్‌యాదవ్, మహేందర్‌రెడ్డి, భాస్కరాచారి, విక్రంరెడ్డి, యాదగిరిచారి తదితరులు పాల్గొన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

శంకర్‌పల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టే పథకాలను అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. గురువారం శంకర్‌పల్లి పట్టణంలో సన్నబియ్యం పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే సన్నబియ్యం పంపిణీ చేశారు. కార్యక్రమంలో శంకర్‌పల్లి మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ కాశెట్టి చంద్రమోహన్, డిప్యూటీ తహసీల్దార్ బాలకృష్ణారెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ రాజశేఖర్‌రెడ్డి, నాయకులు ప్రవీణ్‌కుమార్, వెంకటేశ్, చంద్రమౌళి, రాంరెడ్డి, పాండురంగారెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే సబ్బండవర్గాల అభివృద్ధి

కేశంపేట: రాష్ట్ర ప్రభుత్వం సబ్బండ వర్గాల అభివృద్ధికి కృషి చేస్తుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గూడ వీరేశ్ అన్నారు. మండల పరిధిలోని నిర్దవెల్లి గ్రామంలో గురువారం సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ అజాంఅలీతో కలిసి ఆయన లబ్ధిదారులకు సన్నబియ్యం అందించారు. కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ భాస్కర్‌గౌడ్, పంచాయతీ కార్యదర్శి విజయ్‌కుమార్, శ్రీశైలం, ఖాజాపాషా, జంగయ్య, ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ ఒక్కరికి అందిస్తాం

షాబాద్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన సన్నబియ్యం పథకం ప్రతీ ఒక్కరికి అందే విధంగా కృషి చేస్తామని ఎమెల్యే కాలె యాదయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని ఆస్పల్లిగూడ గ్రామంలో గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్‌తో కలిసి వారు లబ్ధిదారులకు సన్నబియ్యం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అపర్ణ, డిప్యూటీ తహసీల్దార్ మధు, రేషన్ డీలర్లు నర్సింహారెడ్డి, రమేశ్‌గౌడ్ తదితరులు ఉన్నారు.



ఎస్సీ కాలనీలో ప్రమాదకరంగా ఉన్న పైపులైన్ గుంత

తవ్వారు.. మరిచారు

- ప్రమాదకరంగా పైపులైన్ గుంత

మొయినాబాద్‌రూరల్: పదిరోజులైనా పైపులైన్ లీకేజీ మరమ్మతుల కోసం తవ్విన గుంతను పూడ్చకపోవడంతో కాలనీవాసులు ఇబ్బంది పడుతున్నారు. మున్సిపాలిటీ పరిధి హిమాయత్‌నగర్ గ్రామంలోని ఎస్సీ కాలనీలో రోడ్డుపై పదిరోజుల క్రితం అధికారులు పైపులైన్ లీకేజీ మరమ్మతుల కోసం గుంత తీసి వదిలేశారు. ఎవరైనా కొత్త వ్యక్తులు గుంతను గమనించకుండా వెళ్తే అందులో పడిపోయే ప్రమాదం ఉందని కాలనీవాసులు పేర్కొంటున్నారు. ఏ ప్రమాదం జరగకముందే అధికారులు స్పందించి గుంతను పూడ్చాలని కోరుతున్నారు.

డబ్బులు సంపాదించడమే లక్ష్యం

బీఆర్‌ఎస్ రాష్ట్ర యువజన నాయకుడు కార్తీక్‌రెడ్డి



మాట్లాడుతున్న నాయకులు

చేవెళ్ల: కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు, పర్యావరణ రక్షణ అనేది అవసరం లేదని, కేవలం డబ్బులు సంపాదించడమే లక్ష్యంగా రాత్రికి రాత్రి హెచ్‌సీయూ భూములపై పడిందని బీఆర్‌ఎస్ రాష్ట్ర యువజన నాయకులు పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి అన్నారు. చేవెళ్లలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. హెచ్‌సీయూ భూముల వ్యవహారం చూస్తుంటే ఈ ప్రభుత్వం రాత్రికి రాత్రి భూములను అమ్ముకొని డబ్బులు సంపాదించుకోవాలనే ఆలోచనే కనిపిస్తోందన్నారు. చేవెళ్లలోని హైదరాబాద్–బీజాపూర్ రహదారి విస్తరణ కోసం రోడ్డుకు ఇరువైపులా చెట్లను కొట్టకుండా కోర్టుల వైపు చూపిస్తున్నారని, అదే డబ్బుల సంపాదన కోసం అయితే హెచ్‌సీయూ భూముల్లో ఉన్న చెట్లను నరికివేస్తారా అని నిలదీశారు. రోడ్డు విస్తరణకు అడ్డంకిగా మారిన చెట్ల తొలగింపుపై ప్రభుత్వం సరైన నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. చేవెళ్ల రోడ్డు పనులు ఎప్పుడు ప్రారంభిస్తారో చెప్పాలన్నారు. సమావేశంలో ఆయన వెంట డీసీఎంఎస్ మాజీ చైర్మన్ పి.కృష్ణారెడ్డి, నాయకులు దేశమోళ్ల అంజనేయులు, ప్రభాకర్, శ్రీధర్‌రెడ్డి, శివప్రసాద్, నర్సింలు, కరుణాకర్‌రెడ్డి, చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.



చేవెళ్లలో కురుస్తున్న వర్షం

ఉరుములు, మెరుపులతో భారీ వర్షం

చల్లబడిన వాతావరణం



షాబాద్‌లో కురుస్తున్న వర్షం

చేవెళ్ల: మండలంలో గురువారం ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం పడింది. మధ్యాహ్నం 3 గంటల నుంచి రాత్రి వరకు వర్షం పడుతూనే ఉంది. దీంతో వర్షపునీరు రోడ్లపై పారింది. ఉక్కపోతతో అల్లాడిపోతున్న ప్రజలు వాతావరణం చల్లబడడంతో ఊరట చెందారు.

కురిసిన మోస్తరు వర్షం

మొయినాబాద్‌రూరల్: మున్సిపాలిటీ పరిధిలోని గ్రామాల్లో గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకు వాతావరణం ఎండ లేకుండా మేఘాలతో చల్లబడింది. సాయంత్రం వేళ మున్సిపాలిటీ పరిధిలోని అజీజ్‌నగర్, హిమాయత్‌నగర్, ముర్తుజాగూడ, ఎన్కెపల్లితో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో మోస్తరు వర్షం కురవడంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. దీంతో ప్రజలు వేడి నుంచి ఉపశమనం పొందారు.

విద్యుత్ అంతరాయం

షాబాద్: షాబాద్ మండలంలో గురువారం భారీ వర్షం కురిసింది. 5 గంటల పాటు విద్యుత్‌కు అంతరాయం ఏర్పడింది. ఉదయం నుంచి ఎండ ఉన్నా.. మధ్యాహ్నం వర్షం పడడంతో ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

మొయినాబాద్‌రూరల్: ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఎస్ఐ ప్రభాకర్ అన్నారు. గురువారం మున్సిపాలిటీ పరిధిలోని అజీజ్‌నగర్ చౌరస్తాలో వాహనాల ముమ్మర తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ కారణాలతో చలాన్లు ఉన్న వాటిని వెంటనే చెల్లించాలని ఆయన వాహనాదారులు సూచించారు. అదేవిధంగా హెల్మెట్ ధరించాలని, అతివేగం ప్రమాదానికి సూచిక అన్నారు. ప్రమాదాల నివారణకు ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుంటుందన్నారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలు పాటించి ప్రమాదాల నివారణకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పోరాటయోధుడు దొడ్డి కొమురయ్య



చేవెళ్లలో నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య, నాయకులు



మొయినాబాద్‌లో నివాళులర్పిస్తున్న నాయకులు



షాబాద్‌లో..

చేవెళ్ల: తెలంగాణ సాయుధ పోరాటయోధుడు, ఉద్యమంలో తొలి అమరుడు దొడ్డి కొమురయ్య అని పలువురు నాయకులు కొనియాడారు. ఆయన 98వ జయంతి సందర్భంగా మండల కేంద్రంలో ఉన్న దొడ్డి కొమురయ్య విగ్రహానికి ఎమ్మెల్యే కాలె యాదయ్య, పలువురు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. నిజాం నిరంకుశ పాలనను ఆయన వ్యతిరేకించడంతో పాటు సాయుధ పోరాటంలో భూమి, భుక్తి కోసం, వెట్టిచాకిరీ విముక్తి కోసం ఎన్నో పోరాటాలు చేశారని గుర్తుచేశారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర యువ నాయకుడు పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి, దేశమోళ్ల అంజనేయులు, కృష్ణారెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు అనంత్‌రెడ్డి, యువ నాయకుడు డాక్టర్ వైభవ్‌రెడ్డి, సీపీఐ నాయకులు రామస్వామి, సత్తిరెడ్డి, మంజుల, సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

మొయినాబాద్‌లో..

మొయినాబాద్: తెలంగాణ తొలి అమరుడు దొడ్డి కొమరయ్య జయంతి సందర్భంగా మొయినాబాద్ మున్సిపాలిటీలో కురుమ సంఘం ఆధ్వర్యంలో దొడ్డి కొమరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కురుమ సంఘం జిల్లా అధ్యక్షుడు సంగెరి మల్లేశ్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు మోర శ్రీనివాస్, మాజీ సర్పంచ్ గొర్కంటి రాజు, నాయకులు తదితరులు ఉన్నారు.

ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలి

షాబాద్: దొడ్డి కొమురయ్య జీవితాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని కురుమ సంఘం మండల అధ్యక్షుడు మద్దూరు పాండు పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలో కురుమ సంఘం జెండాలను ఆవిష్కరించారు. అనంతరం దొడ్డి కొమురయ్య 98వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో కురుమ సంఘం నాయకులు మాణెయ్య, మహేందర్, సత్తయ్య, రాజు, నరేందర్, కేసారం కృష్ణ, వెంకటేశ్, బీరప్ప తదితరులు ఉన్నారు.

పరామర్శ

షాబాద్: మండల పరిధిలోని తాళ్లపల్లి గ్రామానికి చెందిన మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్, మాజీ సహకార సంఘం చైర్మన్ కొత్తపల్లి లక్ష్మారెడ్డిని గురువారం ఎమ్మెల్యే కాలె యాదయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్, ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్ పరామర్శించారు. మార్చి 30వ తేదీన లక్ష్మారెడ్డి తల్లి పుష్పమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న వారు లక్ష్మారెడ్డిని పరామర్శించారు. వారి వెంట ఎంపీటీసీ మాజీ సభ్యులు కుమ్మరి చెన్నయ్య, నాయకులు తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ భూమి అంటే ప్రజలదికాదా?

- హెచ్‌సీయూ భూములను వదిలేయాలి
- బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు అనంతరెడ్డి



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

మొయినాబాద్: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన 400ల ఎకరాల భూమిని ప్రభుత్వం ఎందుకు అమ్ముతుందని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు కొంపల్లి అనంతరెడ్డి ప్రశ్నించారు. గురువారం మొయినాబాద్ మున్సిపల్ కేంద్రంలో బీఆర్‌ఎస్ నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి రాకముందు ప్రభుత్వ భూములను అమ్మొద్దని చెప్పి, అధికారంలోకి వచ్చాక ఇప్పుడు ఎందుకు అమ్ముతున్నారన్నారు. ప్రభుత్వ భూమి అంటే ప్రజలది కాదా అని ప్రశ్నించారు. హెచ్‌సీయూకు చెందిన 400ల ఎకరాల భూమి జీవవైవిధ్యానికి నెలవుగా ఉందని, హైదరాబాద్ మహానగరానికి పచ్చదనాన్నిచ్చే భూముల్లో బుల్డోజర్లు దింపి సర్వనాశనం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వం ఇప్పటికైనా హెచ్‌సీయూ భూములను వదిలేయాలని, లేదంటే పెద్దఎత్తున ఆందోళన చేస్తామన్నారు. సమావేశంలో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు కొత్త నర్సింహారెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు దారెడ్డి వెంకట్‌రెడ్డి, ఉపాధ్యక్షులు జయవంత్, సుధాకర్‌యాదవ్, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ రవూఫ్, ఎంపీటీసీ మాజీ సభ్యులు కొత్త మాణిక్‌రెడ్డి, మోర శ్రీనివాస్, మాజీ సర్పంచ్ బాల్‌రాజ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు



షాద్‌నగర్: పోలీస్ స్టేషన్‌లో బీజేవైఎం నాయకులు

షాద్‌నగర్: అక్రమ అరెస్టులు, నిర్బంధాలతో ఉద్యమాన్ని ప్రభుత్వం ఆపలేదని బీజేవైఎం అసెంబ్లీ కన్వీనర్ పుట్నాల సాయికుమార్ అన్నారు. ఛలో హెచ్‌సీయూకి పిలుపునిచ్చిన నేపథ్యంలో గురువారం బీజేవైఎం నేతలను పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా పుట్నాల సాయికుమార్ మాట్లాడుతూ.. విద్యార్థుల భవిష్యత్‌ను అంధకారంలోకి నెట్టేందుకు ప్రభుత్వం కుట్రలు పన్నుతోందని ఆరోపించారు. బుల్డోజర్లతో అడవిని ధ్వంసం చేయడం సరికాదన్నారు. గతంలో ప్రభుత్వ భూముల విక్రయాన్ని వ్యతిరేకించిన రేవంత్‌రెడ్డి ఇప్పుడు ఎందుకు వేలం వేస్తున్నారన్నారు. ప్రభుత్వం హైదరాబాద్ యూనివర్సిటీకి చెందిన భూముల వేలాన్ని ఆపాలని డిమాండ్ చేశారు. యూనివర్సిటీ భూములను కాపాడాలను శాంతియుతంగా నిరసన కార్యక్రమానికి పిలుపునిస్తే ప్రభుత్వం పోలీసులతో తమను అక్రమ అరెస్టులు చేయించడం సరికాదన్నారు. అరెస్టు అయిన వారిలో భాను, నవీన్, శ్రీను, శ్రీకాంత్ ఉన్నారు.

ముందస్తు అరెస్టులు సరికాదు

నందిగామ: చలో హెచ్‌సీయూ కార్యాక్రమానికి వెళ్లకుండా ఏబీవీపీ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారని, అరెస్ట్‌లతో ఉద్యమాన్ని ఆపలేరని ఏబీవీపీ మండల కన్వీనర్ నరేశ్‌చారి అన్నారు. చలో హెచ్‌యూసీ కార్యక్రమానికి ఏబీవీపీ నాయకులు వెళ్లకుండా మండల కేంద్రమైన కొత్తూరులో గురువారం పలువురు ఏబీవీపీ నాయకులను ముందస్తు అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ మండల కన్వీనర్ నరేశ్ చారి మాట్లాడుతూ.. హెచ్‌సీయూ భూములను కాపాడాలనే డిమాండ్‌తో పోరాటం చేస్తున్న విద్యార్థి సంఘాలను అణిచివేయాలని చూస్తే ఊరుకునే ప్రసక్తేలేదని మండిపడ్డారు. యూనివర్సిటీకి చెందిన 400 ఎకరాల భూమిని ప్రైవేట్ వ్యక్తులకు అప్పనంగా కట్టబెట్టాలని చూడటం దారుణమన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే హక్కు ప్రతి ఒక్కరికీ ఉందని, అధికార బలంతో అక్రమ అరెస్టులతో ప్రకృతిని నాశనం చేయాలని చూస్తే సహించేది లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. హెచ్‌సీయూ భూములను ఎట్టి పరిస్థితుల్లో వదులుకునేది లేదని, అవసరమైతే ఎంతవరకైనా పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు. అరెస్ట్ అయిన వారిలో జగేష్, శివకుమార్‌చారి, హర్ష యాదవ్, రాజీవ్ తదితరులు ఉన్నారు.

హక్కుల సాధనకు ఐక్యంగా పోరాడుదాం

జేఏసీ నాయకుడు మహ్మద్ పాషా



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న మహ్మద్ పాషా, నాయకులు

షాద్‌నగర్: హక్కుల సాధనకు బీసీ, ఎస్టీ, ఎస్సీలందరం కలిసి ఐక్యంగా పోరాటం చేద్దామని బీసీ, ఎస్సీ, రైట్స్, రాజ్యాధికార సాధన కమిటీ జేఏసీ నాయకుడు మహ్మద్ పాషా అన్నారు. ధర్మ సమాజ్ పార్టీ, బీసీ, ఎస్టీ, రాజ్యాధికార సాధన కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 14న ఆదిలాబాద్‌లో విశారదన్ మహారాజ్ నిర్వహించ తలపెట్టిన లక్ష కిలో మీటర్ల రథయాత్రకు సంబంధించిన కరపత్రాలను గురువారం షాద్‌నగర్ పట్టణంలో ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఉన్న బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి, వారి సంక్షేమం కోసం ధర్మ సమాజ్ పార్టీ పోరాటం చేస్తుందన్నారు. భూమి లేని నిరుపేదలకు స్థలం పంపిణీ చేయాలని డిమాండ్ చేస్తూ పార్టీ వ్యవస్థాపకుడు విశారదన్ మహారాజ్ నేతృత్వంలో రథయాత్ర నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ యాత్ర రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించి ప్రభుత్వం ప్రజలకు చేస్తున్న మోసాలను వివరించి వారిని చైతన్యం చేయనున్నట్లు తెలిపారు. రాజ్యాంగం ప్రకారం బీసీ, ఎస్సీ, ఎస్టీలకు అన్ని రంగాల్లో సమాన వాటా కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు భిక్షపతి, రాకేశ్, నరేశ్, మల్లేశ్, రాజు, పెంటయ్య, చెన్నయ్య, రవీందర్, మహిపాల్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.